PLATINUM JUBILEE YEAR

Visit Internet Edition @ www.jaminryot.com

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి

# జమీన్‌రైతు

సంపుటి : 77 సంచిక :4 27.1.2006 శుక్రవారం 12పేజీలు విడిప్రతి: రూ.3.00

డి.ఆర్. ఉత్తమలో విందుల పసందు

o బర్త్‌డే పార్టీలు, ఎంగేజ్‌మెంటు ఫంక్షన్లు, వివాహాలు తదితర శుభకార్యాలకు, కార్పొరేట్ మీటింగులు, సెమినార్లు, గెట్‌టుగెదర్లు మరియు కాన్ఫరెన్స్‌లకు అత్యాధునిక వసతులతో, అన్ని హంగులతో బేంక్వెట్ హాల్స్ (అన్ని రకముల ఎలక్ట్రానిక్ - సౌండ్, మ్యూజిక్, వీడియో పరికరములతో సహా)

o ప్రతి రోజూ వివిధ రకాల వెజ్&నాన్‌వెజ్ స్పెషల్ బఫే లంచ్ రూ.160/-లకే

మరెన్నో వసతులతో మీకు స్వాగతం పలికే మీ డి.ఆర్. ఉత్తమ ★ ★ ★ హోటల్

D.R. UTTHAMA HOTEL

23/976, Dhandayudha Puram, Nellore - 3. Phones : 2317777 - 10 Lines

ప్లీనరీ దిగ్విజయంతో....

# వైఎస్‌కు వెయ్యేనుగుల బలం!

కాంగ్రెస్ ప్లీనరీ విజయం జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ ఆరంగేట్రానికి స్వాగత ద్వారం తెరిస్తే, రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి స్థానాన్ని మరింత పదిలం చేసింది. ఈ ప్లీనరీ నిర్వహణలోని పరమార్థం రాహుల్ గాంధీకి

**అది పథకం ప్రకారం జరిగిందో లేక కాంగ్రెస్ వాదులకు అలవాటైన భజన సంస్కృతి వల్ల జరిగిపోయిందో కానీ, ఇటు పార్టీ కార్యకర్తలు, అటు ప్రజలలో కూడా రాహుల్ గాంధీ ప్రతిష్ట పెంచడానికి మాత్రమే ప్లీనరీ ఉపయోగపడింది అన్నది వాస్తవం.**

అగ్రాసనం వేయడం అన్న సంగతి బహిరంగ రహస్యం. ఆయనకు సిడబ్ల్యుసిలో స్థానం కల్పించక పోయినప్పటికీ, సీనియర్ నేతలతో సమంగా ఆయనకు వేదిక మీద చోటు ఇవ్వక పోయినప్పటికీ ప్లీనరీ మొత్తం రాహుల్ పేరే స్మరించింది; పలవరించింది. అది పథకం ప్రకారం జరిగిందో లేక కాంగ్రెస్ వాదులకు అలవాటైన భజన సంస్కృతి వల్ల అనుకోకుండా జరిగిపోయిందో కానీ, ఇటు పార్టీ కార్యకర్తలు, అటు ప్రజలలో కూడా రాహుల్ గాంధీ ప్రతిష్టను పెంచడానికి మాత్రమే ఈ ప్లీనరీ ఉపయోగపడింది అన్నది వాస్తవం. సాధారణ ప్లీనరీలో వలె ఇక్కడ ఏ జాతీయ సమస్యపైనా విస్తృత స్థాయి చర్చ జరగలేదు; కాంగ్రెస్ పార్టీ అనుసరించ వలసిన రాజకీయ, ఆర్థిక విధానాల సమీక్ష చేయలేదు; ప్రభుత్వ కార్యక్రమాల తలపోత జరగనే లేదు. జరిగింది సమస్తం – రాహుల్ భజన మాత్రమే. రాహుల్ గాంధీ వస్తే తప్ప కాంగ్రెస్‌కు పూర్వ వైభవం రాదు అని అన్ని స్థాయిల కాంగ్రెస్‌వాదులు ఎలుగెత్తి చాటారు. రాహుల్ గాంధీ రాకుంటే కాంగ్రెస్‌కు భవిష్యత్తే లేదని ఆక్రోశించారు. వీరింతగా ఘోషిస్తున్నా ఆయన మాత్రం పట్టీ పట్టనట్లే వుండిపోయారు. వేదిక ఎక్కి నాలుగు మాటలు మాట్లాడడానికి కూడా బెట్టు చేశాడు. చిట్టచివరి రోజు వరకు ఈ నాటకం నడిచింది. అయితే ఆఖరు రోజు ఆయన చేసిన ప్రసంగం మాత్రం కాంగ్రెస్ వాదులకే కాక, సాధారణ పౌరులను కూడా బాగా ఆకట్టుకున్నాదన్న మాట నిజం. ఉత్తరప్రదేశ్ వంటి ముఖ్య రాష్ట్రాలలో కాంగ్రెస్ అంతర్ధానం కావడానికి పార్టీ పోకడే కారణమని కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పాడు రాహుల్ గాంధీ. ప్రజల కోసం, ప్రజలతో కలిసి పనిచేయనందు వల్లనే కాంగ్రెస్ పార్టీ ప్రజలకు దూరమైందని; తన వంటి యువకులు పదవులు ఆశించకుండా పార్టీ పునరుజ్జీవనానికి చిత్తశుద్ధితో ప్రయత్నం చేయాలని ఉద్బో

తరువాయి 12వ పేజీలో



అమ్మా... నీ వెంటే వస్తున్నా!



తనయుడికి తల్లి మంత్రోపదేశం

## చంద్రబాబుకు థ్యాంక్స్

ప్లీనరీ నిర్వహణ విజయం ఘనత మొత్తం ముఖ్యంత్రి రాజశేఖరరెడ్డి గారికే దక్కిన మాట నిజమే అయినప్పటికీ; అందుకు కారకుడు మాత్రం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కావడం ఎవరి దృష్టినీ దాటిపోలేదు. చంద్రబాబు టిడిపి నేత కాబట్టి సరిపోయింది కానీ, అదే ఏ కాంగ్రెస్ వాదో అయివుంటే ప్రతి ఒక్కరూ వేదిక మీద నుంచే థ్యాంక్స్ చెప్పి వుండేవారు. అందుకు కారణం ఏఐసిసి ప్లీనరీకి వాడిన ప్రతివేదిక, ప్రతి భవనమూ చంద్రబాబు కట్టించినవే కావడం. గచ్చిబౌలిలో బాలయోగి పేరిట చంద్రబాబు నిర్మించిన క్రీడా మైదానం అంతర్జాతీయ స్థాయి నాణ్యతతో కూడుకున్నది. క్రీడల కోసం అంత ఖర్చు పెడుతున్నారని అప్పట్లో రాజశేఖరరెడ్డి, చంద్రబాబును తిట్టి పోశాడు కూడా. ఆటలు లేనప్పుడు ఈ మైదానం ఏమి చేస్తారు అని ప్రశ్నించారు. కానీ ఇప్పుడు అదే మైదానం అదే రాజశేఖరరెడ్డికి కలిసి వచ్చింది. ఇరవై వేల మంది ప్రతినిధులతో సదస్సు నిర్వహించడం చాలా సులభంగా జరిగిపోయింది. మైదానం నిండా పచ్చటి తివాచీ పరవడం; పందిళ్లు వేయడం తప్ప మరొక కష్టం లేకుండా పోయింది నిర్వాహకులకు. ఈ స్టేడియం ప్రక్కనే చంద్రబాబు ప్రేరణతో నిర్మితమైన ఇంటర్నేషనల్ బిజినెస్ స్కూల్ సిడబ్ల్యుసి సభ్యులు, సీనియర్ కేంద్రమంత్రుల బసకు ఉపకరించింది. లేకుంటే వారికోసం స్టార్ హోటళ్లలో గదులు చూపించలేక ఇబ్బంది పడవలసి వచ్చేది. చంద్రబాబు కోరిక మీదనే ఐవిఆర్‌సిఎల్ కంపెనీ ఆనాడు కట్టిన గేమ్స్ విలేజ్‌లోని ఆధునిక విల్లాలు సోనియా, రాహుల్, మన్మోహన్ సింగ్‌ల విడిదికి ఉపకరించాయి. అవి స్టేడియం ప్రక్కనే వుండడం వల్ల వారి రాకపోకలకు భద్రతా ఏర్పాట్ల బాధ తప్పింది. వారిని సిటీ

తరువాయి 12వ పేజీలో

Registered : RN 1156/57
No. PLG/NL/9-8/06


## వెయ్యేనుగుల బలం

మొదటి పేజీ తరువాయి

ధించాడు రాహుల్ గాంధీ. సాధారణంగా కాంగ్రెస్ పెద్దలందరూ పెద్ద పెద్ద పదవులలో సుఖంగా ఆసీనులై, ఇటువంటి ఉపన్యాసాలు దంచుతూ వుంటారు. రాహుల్ ఆ పొరపాటు చేయకపోవడం నిజంగా గొప్ప విషయమే. ఆయన మాటలు వేదికకు మాత్రం కాకుండా, ఆచరణలోను పదవీ మోహం లేకుండా పార్టీ సేవకోసం పనిచేస్తే - కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వచ్చినట్లే భావించాలి. అటువంటి నాయకుల కోసమే ఎదురు చూస్తున్నది దేశమిప్పుడు. ఆ దృష్టితో చూసినప్పుడు ఈ ప్లీనరీ చరిత్రాత్మకమైనదిగానే పరిగణించాలి.

ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విషయానికి వస్తే, ఆయన రాజకీయ జీవితంలో ఇదొక సువర్ణ ఘట్టం. ఒంటి చేత్తో కాంగ్రెస్ మహాసదస్సు నిర్వహించే అవకాశం ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప లభించదు. మన రాష్ట్రానికి సంబంధించి ఇటీవల కాలంలో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డికి ఆ అదృష్టం దక్కింది. 1992లో తిరుపతి ఏఐసిసి ప్లీనరీ నిర్వహణ ద్వారా ఆనాటి కాంగ్రెస్ వాదులందరికీ ప్రీతిపాత్రుడైనాడాయన. అయితే ఆ కష్ట ఫలితం ఆయనకు రాజకీయంగా ఉపయోగపడలేదు. ప్లీనరీ బాగా చేసుకున్నావని మెచ్చుకోవడం తప్ప, పార్టీలో ఆయనకు అందుకు తగిన స్థానం కల్పించలేదు ఆనాటి అగ్రనాయకత్వం. ఈ కోణం నుంచి చూసినప్పుడు రాజశేఖరరెడ్డి చాలా అదృష్టవంతుడు. తన రాజకీయ జీవిత ప్రాభవం దేదీప్యమానంగా వెలుగొందుతున్న సమయంలో ఈ అవకాశం లభించింది ఆయనకు. తనకు అప్పచెప్పిన బాధ్యతను అనుకున్న దానికంటే గొప్పగా నెరవేర్చాడు. ఇటీవల కాలంలో ఇంత గొప్పగా ఏఐసిసి ప్లీనరీ నిర్వహించిన వారు లేరని అందరి మెప్పు పొందారు.

నిజంగా ఆ ఏర్పాట్లు ఎంతో ఘనమైనవి. వచ్చిన ప్రతి అతిథికీ, వారి వారి స్థాయికి తగినట్లు అత్యంత పకడ్బందీగా మర్యాదలు జరిగాయి. స్టార్ హోటళ్లలో బస, షడ్రసోపేతమైన భోజనం, రాకపోకలకు లగ్జరీ కార్లు, ఎక్కడా ఏ గందరగోళం లేకుండా కట్టుదిట్టమైన ప్రణాళిక, దేనికీ లోటు అన్పించుకోకుండా ధన ప్రవాహం, చిన్న పొరపాటు కూడా దొర్లకుండా 17 వేల మంది పోలీసులతో రాత్రింబవళ్లు పహారా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అడుగడుగునా బందోబస్తు, ఎన్నివేల మంది ఒకేసారి భోజనానికి వచ్చినా తొక్కిడి, తోపులాట లేకుండా సుఖంగా విందారగించడానికి తగినట్లు విశాలమైన ఫుడ్ కోర్టులు... ఇట్లా ప్రతి అంశంలోను సదస్సు నిర్వహణ అంటే ఇట్లా వుండాలి అన్న రీతిలో నడిపించాడు రాజశేఖరరెడ్డి. నిజానికి ఈ ఘనత అంతా ముఖ్యమంత్రి స్నేహితుడు, సలహాదారుడు కెవిపి రామచంద్రరావుకు దక్కాలి. తెర వెనుక నుంచి ఈ మొత్తం కసరత్తు చేసింది రామచంద్రరావే. అందువల్లనే ప్లీనరీ వేదిక మీద నుంచే దిగ్విజయ్‌సింగ్, రామచంద్రరావుకు అభినందనలు తెలిపారు. తిరుపతి ప్లీనరీలో అప్పటి ఒంగోలు ఎమ్పీ మాగుంట సుబ్బరామరెడ్డి ఇదే మాదిరి కష్టపడ్డాడు. ఆ ప్లీనరీకి హాజరైన వారంతా సుబ్బరామరెడ్డిని మనసారా మెచ్చుకుంటే, ఈ ప్లీనరీకి వచ్చిన వారంతా రామచంద్రరావు భుజం తట్టి వెళ్లారు.

ఈ సదస్సు ద్వారా రాజశేఖరరెడ్డి ఢిల్లీ పెద్దలందరి అభిమానం చూరగొన్నారు. సోనియాగాంధీ అయితే ఆయన్ను ప్రత్యేకంగా తన బసలో తనతో పాటు భోజనానికి ఆహ్వానించారు. ప్రధాని మన్మోహన్‌సింగ్ రాష్ట్రానికి ఏమి కావాలన్నా అడగండి చేసి పెడతా అని చెప్పాడు. ఆర్థికమంత్రి చిదంబరం - జలయజ్ఞం ప్రాజెక్టులకు నిధులు కావాలన్నా అడగండి, ఇస్తాను అని హామీ ఇచ్చాడు. ఇతర మంత్రులు, సీనియర్ నేతలు కూడా రాజశేఖరరెడ్డి ఏ కోరిక కోరితే అది తీర్చే ధోరణిలో మాట్లాడారు. ఈ తరహా మెప్పు పొందడం ద్వారా ఆయన పార్టీలో, ప్రభుత్వంలో తన స్థానం సుస్థిరం చేసుకున్నట్లే లెక్క. నిజానికి ఈనాటి వరకు ఆయనకు పార్టీలో పెద్ద ఇబ్బంది అంటూ ఏదీ లేదు. మర్రి శశిధర్‌రెడ్డి, పి జనార్ధనరెడ్డి లిరువురు మాత్రం కొంత కలకలం సృష్టిస్తున్నారు గత కొంత కాలంగా. కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి వారిని వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు. ప్లీనరీ విజయంతో వారి చర్యలకు కూడా బ్రేక్ పడడం ఖాయం. కనీసం మరొక ఏడాది పాటు ఢిల్లీ వెళ్లి రాజశేఖరరెడ్డి మీద పితూరీ చెప్పడానికి ఏ కాంగ్రెస్ నేత కూడా సాహసించడు అన్నది వాస్తవం. కాంగ్రెస్ ముఖ్యమంత్రులకు అంతకంటే కావలసింది ఏమి వుంటుంది?



నెల్లూరు జిల్లా కలెక్టర్ రవిచంద్ర, ఎస్పీ శివధర్‌రెడ్డి మంచి ఆటగాళ్లు. ఏసి స్టేడియంలో 22తేది జిల్లా అధికారులు, జర్నలిస్టుల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో వీరిద్దరి బ్యాటింగ్, బౌలింగ్ ప్రతిభను ఈ ఫోటోలో చూడొచ్చు

## చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

నుంచి అక్కడకు తీసుక వెళ్లవలసి వచ్చి వుంటే మాత్రం, హైదరాబాద్ నగరవాసులు ట్రాఫిక్ ఆంక్షలతో నరకం చవిచూసి వుండేవారు. హైటెక్ సిటీకి చంద్రబాబు వేసిన రోడ్లు, విశాలమైన పార్కింగ్ మైదానాలు కూడా ఎంతగానో ఉపకరించాయి. మొత్తం మీద చంద్రబాబు కాంగ్రెస్ సదస్సు నిర్వహణకు పరోక్షంగా చాలా బాగా సహకరించాడు. బయట పడలేదు కానీ, దీని నిర్వహణలో పాలుపంచుకున్న ప్రతి కార్యకర్త, నాయకుడు కూడా మన సులో ఆయనకు ధన్యవాదాలు చెల్లించుకున్నారు.


అన్ని ప్రముఖ
కంపెనీల మందులు
లభించును
**వివేకా మెడికల్స్**
పొగతోట, నెల్లూరు
ఫోన్: 2327691





# శుభస్వీకరణ

"కష్ట సుఖాలలో కలిమిలేములలో
కలతలు ఎరుగని మంచి మనసుమీది"

మీరు నేర్పిన దైవభక్తి పరాయణత, అకుంఠిత శ్రమ,
అందరిని ప్రేమగా పలకరించే కలుపుగోలు తనం,
తన, మన భేదం ఎరుగక అందరికి చేయూతనిచ్చే మనస్తత్వం మీది.
మంచికి మారుపేరుగా మా అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసి
నేడు మా ఉన్నత స్థితికి కారకులైన మా మాతృమూర్తి

## శ్రీమతి సూదలగుంట లక్ష్మమ్మ గారు

18.01.2006 తేది బుధవారం స్వర్గప్రాప్తి చెందారు.
28.01.2006 శనివారం ఉ॥ 11గం॥లకు తిరుపతి, రేణిగుంటరోడ్,
శ్రీ పద్మావతి ఫ్లోర్ మిల్స్ ప్రాంగణము నందు కర్మక్రియలు జరుగును.
కావున తెలియజేయడమైనది.



మరణం : 18.01.2006

కీ॥శే॥ శ్రీమతి సూదలగుంట లక్ష్మమ్మ గారు,
W/o లేట్ శ్రీ సూదలగుంట పెంచలనాయుడు, తిరుపతి

కుమార్తె : గుడ్లూరు వెంకటరమణమ్మ
కుమారులు :
సూదలగుంట వీరపనాయుడు
సూదలగుంట వెంకటరమణయ్య నాయుడు
సూదలగుంట జయరామ చౌదరి - శ్రీమతి సూదలగుంట ప్రమీలమ్మ
మనుమడు : సూదలగుంట కృష్ణ కళ్యాణ్ కుమార్
మరియు బంధుమిత్రులు

"నిరాడంబరత, నిగర్వత, పరిశుభ్రత, కర్తవ్య నిర్వహణత, భక్తిత్వం",
"కృషితో నాస్తి దుర్భిక్షం" అను మీ యొక్క తత్వాన్ని ఎల్లప్పుడూ ఆచరిస్తూ...
మీ అడుగుజాడలలో సదా పయనిస్తామని మనవి చేసుకుంటూ...


Edited, Printed and Published by N. Dolendra Prasad, Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.